క్లుప్తంగా

కొనసాగుతున్న దివ్యాంగ బాలల సర్వే



జికొండూరు: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన దివ్యాంగ బాలల గుర్తింపు నమోదు కార్యక్రమం జి.కొండూరు మండలంలో శరవేగంగా కొనసాగుతోంది. మే 5 నుంచి జూన్ 7వ తేదీ వరకు జరిగే సర్వేలో స్థానిక భవిత కేంద్రం సహిత ఉపాధ్యాయులు సీహెచ్ రత్నకుమారి, ఎం.రాజు, సచివాలయ ఉద్యోగులు, అంగన్‌వాడీలు, ఆశాలు మంగళవారం గ్రామాల్లో సర్వే ద్వారా గుర్తించారు. దివ్యాంగ చిన్నారులను గుర్తించి భవిత కేంద్రాలు, పాఠశాలల్లో చేర్పించి ప్రభుత్వం కల్పించే ప్రయోజనాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. వారికి అవసరమైన విద్య, శిక్షణ, అలవెన్స్, ఫిజియోథెరపీ వంటి ఉచిత సేవలు అందుతాయని వివరించారు.

ఘనంగా కోదండ రామాలయం వార్షికోత్సవం



ఊటుకూరు(గంపలగూడెం): ఊటుకూరు కోదండ రామాలయం వార్షికోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు లక్ష్మీనారాయణశర్మ ఆధ్వర్యంలో గణపతి పూజతో ప్రత్యేక కార్యక్రమాలు జరిగాయి. దేవతామూర్తుల మూలవిరాట్ విగ్రహాలకు అభిషేకం, విశేష అలంకరణ, ప్రత్యేక పూజలు జరిగాయి. ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీలో ఉంచి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో భక్తులు విశేషంగా పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణానికి సహకరించండి

నూజివీడు రూరల్ సీఐ రామకృష్ణ



ఆగిరిపల్లి: గ్రామాలలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజలు సహకరించాలని నూజివీడు రూరల్ సీఐ రామకృష్ణ అన్నారు. ఓట్ల లెక్కింపు నేపథ్యంలో మంగళవారం ఆగిరిపల్లిలో శాంతి భద్రతలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఎన్నికల అనంతరం ప్రతి ఒక్కరూ అన్నదమ్ముల వలే కలిసి ఉండాలని ఆయన సూచించారు. ఎన్నికల ఫలితాల అనంతరం కూడా ర్యాలీలు, ఊరేగింపులు, టపాసులు పేల్చడం నిషేధమని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎస్ఐ సురేంద్ర కుమార్, ఏఎస్ఐ తవేరియా నాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

తిరువూరు: పర్యావరణ పరిరక్షణపై తిరువూరు వసుధ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో మంగళవారం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. స్థానిక శ్రీనిధి జూనియర్ కళాశాల ఆవరణలో నిర్వహించిన పోటీల్లో పలువురు విద్యార్థులు పాల్గొన్నారు. జూన్ 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా వ్యాసరచన పోటీల విజేతలకు బహుమతి ప్రదానం చేస్తామని సొసైటీ డైరెక్టర్ ఆనందరావు తెలిపారు.

నేడు బహిరంగ వేలం

మేదూరు(గంపలగూడెం): మేదూరు వీరాంజనేయస్వామి ఆలయంలో భక్తులు స్వామి వారికి సమర్పించే తలనీలాలను పోగుచేసుకునే హక్కునకు బుధవారం బహిరంగ వేలం నిర్వహిస్తామని ఆలయ మేనేజర్ జన్ను వెంకటేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. జూన్ ఒకటో తేదీ నుంచి ఏడాది పాటు తలనీలాలు పోగుచేసుకునేందుకు వేలం నిర్వహిస్తామని చెప్పారు. పాల్గొనదలిచిన వారు ముందుగా రూ.10 వేలు ధరావతు చెల్లించాలన్నారు.

టెన్త్ పరీక్షలకు 365 మంది గైర్హాజరు

నూజివీడు: డివిజన్‌లోని ఐదు పరీక్ష కేంద్రాల్లో మంగళవారం నిర్వహించిన పదో తరగతి సప్లిమెంటరీ గణితం పరీక్షకు 365 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని డీవైఈఓ ఎం.సేవియా తెలిపారు. మొత్తం 681 మంది విద్యార్థులకు గాను 316 మంది హాజరయ్యారు. పట్టణంలోని ఎస్ఆర్ఆర్ హైస్కూల్‌లో 161 మందికి 62 మంది, జెడ్పీ బాలికల హైస్కూల్ ప్లస్ కేంద్రంలో 144 మందికి 76 మంది, మునునూరు హైస్కూల్ సెంటర్‌లో 151 మందికి 81 మంది, చాట్రాయి హైస్కూల్ సెంటర్‌లో 94 మందికి 53 మంది, ఆగిరిపల్లి హైస్కూల్ సెంటర్‌లో 131 మందికి 44 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఆయా పరీక్ష కేంద్రాల సీఎస్‌లు, డీఓలు పర్యవేక్షించారు.

రోగులకు సత్వర సేవలు



అధునాతన భవనంతో తిరువూరు ప్రభుత్వాస్పత్రి



తిరువూరు ప్రభుత్వాస్పత్రిలో డయాలసిస్ యూనిట్

- తిరువూరు ప్రభుత్వాస్పత్రిలో ఆధునిక సదుపాయాలు
- స్పెషలిస్టు వైద్యుల నియామకంతో తీరిన కొరత
- డయాలసిస్ రోగులకు ప్రత్యేక వైద్యసేవలు

తిరువూరు: తిరువూరు ప్రభుత్వాస్పత్రిలో సదుపాయాలు మెరుగుపడటంతో పేద రోగులకు సత్వర వైద్య సేవలందుతున్నాయి. ఎన్టీఆర్, ఖమ్మం జిల్లాల్లోని గ్రామీణ ప్రాంత ప్రజలకు సాధారణ వైద్యసేవలతో పాటు మహిళలకు ప్రసూతి సేవలు సైతం పూర్తిస్థాయిలో అందుతున్నాయి. రూ.ఐదు కోట్ల వ్యయంతో అధునాతన భవనాలను నిర్మించడంతో వార్డుల కొరత తీరింది. విశాలమైన జనరల్ వార్డుతో పాటు ప్రత్యేక గదులను కూడా రోగులకు అందుబాటులోకి తెచ్చారు. నిత్యం 250 నుంచి 300 మంది అవుట్ పేషెంట్లకు ఇక్కడ వైద్య పరీక్షలు చేయడంతో పాటు అత్యవసర వైద్య సేవలు కూడా అందిస్తున్నారు. 24 గంటలూ ఆక్సిజన్ సరఫరా, విద్యుత్ సరఫరా లేనపుడు జనరేటర్ సదుపాయం కల్పించారు. స్వచ్ఛమైన తాగునీరందించేందుకు ఆర్‌వో ప్లాంటు కూడా నిర్వహిస్తున్నారు. ఆరోగ్యశ్రీ విభాగాన్ని ఏర్పాటు చేసి అవసరమైన రోగులకు వైద్య పరీక్షలను బయటి ఆస్పత్రుల ద్వారా ఉచితంగా చేపడుతున్నారు.

డయాలసిస్ యూనిట్ ఏర్పాటు

కిడ్నీ సమస్యతో చికిత్స నిమిత్తం వచ్చే రోగులకు తిరువూరు ప్రభుత్వాస్పత్రిలో ప్రత్యేక డయాలసిస్ యూనిట్ నిర్వహిస్తున్నారు. 10 యూనిట్లలో నిత్యం 100 మందికి పైగా డయాలసిస్ రోగులకు సేవలందిస్తున్నారు. ఖమ్మం జిల్లాలోని రోగులు సైతం డయాలసిస్ సేవలకు ఈ ఆస్పత్రికి వస్తున్నారు. అపోలో ఆస్పత్రి వైద్యుల పర్యవేక్షణలో డయాలసిస్ విభాగంలో ఆధునిక వైద్య సేవలందిస్తున్నారు.

వైద్య నిపుణుల నియామకం

దీర్ఘకాలంగా వైద్య నిపుణుల కొరత నెలకొన్న తిరువూరు ప్రభుత్వాస్పత్రిలో గత రెండేళ్లుగా గైనకాలజిస్టు, ఎనస్థీషియన్, ఆర్థోపెడిక్ సర్జన్, దంత వైద్య నిపుణుల నియామకం జరగడంతో రోగులకు పూర్తి స్థాయిలో సేవలందుతున్నాయి. పీపీ యూనిట్ల నుంచి రిఫర్ చేసే ప్రసూతి మహిళలకు సాధారణ కాన్పులతో పాటు అవసరమైతే ఆపరేషన్ నిర్వహించేందుకు కూడా ఆపరేషన్ థియేటర్‌లో ఆధునిక సదుపాయాలు కల్పించారు. హైరిస్క్ కేసులను విజయవాడ జీజీహెచ్‌కి రిఫర్ చేస్తున్నారు. నెలకు 50కి పైగా ప్రసూతి కేసులు నమోదవుతున్నాయి.

వైద్య సేవలు సద్వినియోగం చేసుకోవాలి



పేద రోగులకు సత్వర వైద్య సేవలందించేందుకు తిరువూరు ప్రభుత్వాస్పత్రిలో అన్ని సదుపాయాలు కల్పించారు. వైద్య నిపుణులు కూడా అందుబాటులో ఉన్నందున రోగులు సద్వినియోగం చేసుకోవాలి.

– డాక్టర్ గార్గేయ, వైద్యాధికారి, తిరువూరు ప్రభుత్వాస్పత్రి

గణితంపై పట్టు సాధించాలి

మైలవరం: గణిత శాస్త్రంపై విద్యార్థులు శ్రద్ధ పెడితే పట్టు సాధించవచ్చని మైలవరం ఆక్స్‌ఫర్డ్ హైస్కూల్ ఉపాధ్యాయులు ఎం. శ్రీనివాస్ అన్నారు. కృష్ణా జిల్లా గ్రంథాలయ సంస్థ మైలవరం శాఖ గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో మంగళవారం విద్యార్థులకు గణిత శాస్త్రంపై అవగాహన కల్పించారు. విద్యార్థులు మ్యాథ్స్ అంటే కొంత ఆందోళనకు గురవుతారని, కానీ శ్రద్ధతో ఆలకిస్తే ఇష్టపడతారని చెప్పారు. ప్రణాళిక ప్రకారం విద్యార్థులు చదువుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సూచించారు. మ్యాథ్స్‌లోని సూత్రాలు వివరించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి నాగార్జున, విద్యార్థులు, పాఠకులు, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఉపాధ్యాయులు శ్రీనివాస్

ఆంగ్లభాషపై భయం పోవాలి..

తిరువూరు: విద్యార్థుల్లో ఎక్కువమంది ఆంగ్లభాషంటే భయపడతారని, ఈ భాషను చాలా తేలికగా నేర్చుకోవచ్చని ఆంగ్ల భాషోపాధ్యాయ సంఘ కన్వీనర్ రాంప్రదీప్ అన్నారు. స్థానిక గ్రేడ్ 1 శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా మంగళవారం స్పోకెన్ ఇంగ్లిష్‌లో శిక్షణ ఇచ్చారు. ప్రతి విద్యార్థీ ఇంగ్లిష్ నేర్చుకోవడంలో ఆసక్తి కలిగి ఉండాలని, గ్రామర్, స్పోకెన్ ఇంగ్లిష్ తప్పక నేర్చుకుంటే ఏ ప్రాంతంలోనైనా జీవించవచ్చని చెప్పారు. చిత్రలేఖనం, సైన్స్ తదితర అంశాల్లో ఉపాధ్యాయులు శిక్షణ ఇచ్చారు. గ్రంథాలయాధికారి పద్మావతి పర్యవేక్షించారు.



తిరువూరు గ్రంథాలయంలో స్పోకెన్ ఇంగ్లిష్‌లో శిక్షణ ఇస్తున్న రాంప్రదీప్

హీల్ సేవలు అభినందనీయం

ఆగిరిపల్లి: పుట్టుకతో లేదా ప్రమాదంలో అంగవైకల్యం పొందిన దివ్యాంగులకు హీల్ సంస్థ చేస్తున్న సేవలు అభినందనీయమని డాక్టర్ సరయు అన్నారు. తోటపల్లి హీల్ సంస్థల ఆధ్వర్యంలో మంగళవారం ఇద్దరు దివ్యాంగులకు కృత్రిమ కాళ్లను డాక్టర్ సరయు, సంఘ సేవకులు కలగర నాగభూషణం అందజేశారు. ఆమె మాట్లాడుతూ అనాథలైన చిన్నారులకు ఉచిత విద్య, వసతి కల్పించడంతోపాటు అంధ విద్యార్థులకు బ్రెయిలీ లిపి, కంప్యూటర్ విద్య, అందించడం ద్వారా వారిని సమాజంలో స్వయం శక్తిగా ఎదగడానికి కృషి చేస్తున్న హీల్ సంస్థ సేవలు అందరికీ స్ఫూర్తిదాయకమన్నారు. హీల్ కార్యదర్శి తాతినేని లక్ష్మి, సీఈఓ కూరపాటి అజయ్‌కుమార్, కృత్రిమ అవయవ కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.



దివ్యాంగులకు కృత్రిమ కాళ్లను అందజేస్తున్న డాక్టర్ సరయు, నాగభూషణరావు

క్యాన్సర్ చికిత్సకు అందుబాటులో ఆధునిక వైద్యం

సిద్ధార్థ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కంచర్ల సుధాకర్

లబ్బీపేట(విజయవాడతూర్పు): క్యాన్సర్‌ను తొలి దశలో గుర్తించడం ద్వారా పూర్తిగా నయం చేయవచ్చునని, అందుకు స్క్రీనింగ్ ఎంతో కీలకమని సిద్ధార్థ ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కంచర్ల సుధాకర్ అన్నారు. జిల్లా నాన్ కమ్యూనికల్ డిసీజ్, కమ్యూనికల్ డిసీజ్(ఎన్‌సీడీ, సీడీ) ప్రోగ్రామ్‌లో భాగంగా మంగళవారం జిల్లా స్థాయి క్యాన్సర్ స్క్రీనింగ్ శిక్షణ కార్యక్రమం జరిగింది. సిద్ధార్థ వైద్య కళాశాల లెక్చర్ హాల్‌లో జరిగిన ఈ కార్యక్రమాన్ని ప్రిన్సిపాల్ డాక్టర్ కంచర్ల సుధాకర్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ క్యాన్సర్‌కు ఇప్పుడు అధునాతన వైద్యం అందుబాటులో ఉందన్నారు. సరైన సమయంలో వైద్యం పొందడం ఎంతో ముఖ్యమన్నారు. కార్యక్రమంలో కమ్యూనిటీ మెడిసిన్ హెచ్ఓడీ డాక్టర్ నాగేశ్వరరావు, సోషల్ అండ్ ప్రివెంటివ్ మెడిసిన్ ప్రొఫెసర్ డాక్టర్ పి.మాధవి, ఎన్‌సీడీ, సీడీ ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ జి.మాధవి పాల్గొన్నారు. ఈ శిక్షణ కార్యక్రమంలో సీహెచ్‌సీల్లో గైనకాలజిస్టులు, దంత వైద్యులు పాల్గొన్నారు. ఈ నెల 30వ తేదీ వరకు శిక్షణ కార్యక్రమం కొనసాగనుంది. వారిలో ప్రివెంటివ్ అంకాలజీ యూనిట్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ ఆషా పర్వీన్ సయ్యద్, గైనకాలజిస్టు డాక్టర్ ఆనంద సాగరి, ఈఎన్‌టీ నిపుణుడు డాక్టర్ కె.ఆదిత్య, జనరల్ సర్జన్ డాక్టర్ ఎన్వీ శివమోహన్, డెంటల్ సర్జన్ డాక్టర్ సుధాకర్, పల్మనాలజిస్ట్ డాక్టర్ ఎం.సురేష్, రేడియాలజిస్ట్ డాక్టర్ గురివిరెడ్డి అవగాహన కలిగించనున్నారు.



శిక్షణ శిబిరాన్ని పారంభిస్తున్న సిద్ధార్థ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కంచర్ల సుధాకర్

ఐక్యంగా కృషి చేయాలి

వీరులపాడు: క్రైస్తవ సేవకులు ఐక్యంగా ఉంటే ప్రతి సమస్యను పరిష్కరించుకోవచ్చని మండల పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షుడు బీఎస్ పాల్ అన్నారు. మండలంలోని పొన్నవరం గ్రామంలోని బాప్టిస్ట్ పాస్టర్ ఇమ్మానుయేల్ చర్చిలో మంగళవారం మండల పాస్టర్స్ ఫెలోషిప్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐక్యంగా ఉంటే ప్రతికూల పరిస్థితులలో సైతం మన సమస్యలను పరిష్కరించుకునే వీలుంటుందన్నారు. క్రైస్తవులంతా ఒకే మాట, ఒకే మనసు కలిగి ఉండి తోటి వారికి మంచి చేసేలా నడుచుకోవాలని సూచించారు. సమావేశంలో హనోక్, సీయోన్ కుమార్, సంసోను, శామ్యూల్ రాజ్, స్వామిదాసు, హిజ్కియా రాజు, అబ్రహం, ఏసుదాసు పాల్గొన్నారు.

దాతల సాయంతో మజ్జిగ పంపిణీ

నందిగామ: సత్య దివ్యాంగుల సేవా సమితి ఆధ్వర్యంలో దాతల సాయంతో మంగళవారం మజ్జిగ పంపిణీ చేశారు. పట్టణంలోని మెయిన్ బజార్‌లో గత కొన్ని సంవత్సరాలుగా వేసవి కాలంలో మూడు నెలలపాటు చలివేంద్రాన్ని ఏర్పాటు చేసి నిత్యం దాతల సాయంతో చల్లటి తాగునీటితోపాటు మజ్జిగ పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమానికి సహకరిస్తున్న ప్రతి ఒక్కరికీ సేవా సమితి నిర్వాహకుడు కోటి సూర్యం అభినందనలు తెలిపారు.

రేపు హనుమాన్ చాలీసా పారాయణం

మైలవరం: హనుమజ్జయంతిని పురస్కరించుకుని గురువారం ఉదయం ఆరు నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు మైలవరం వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో హనుమాన్ చాలీసా పారాయణ జరుగుతుందని ఎన్టీఆర్ జిల్లా ధార్మిక మండలి సభ్యులు వజ్జల బాలాజీ ప్రసాద్, బొమ్మారెడ్డి సుధాకరరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. హనుమాన్ చాలీసా పారాయణంలో 500 మంది భక్తులు, జిల్లాలోని 35 భజన సంఘాలు పాల్గొంటాయన్నారు. టీటీడీ అధికారులతో పాటు ముఖ్య అతిథిగా పరిటాల ఆంజనేయస్వామి ఆలయం స్వామీజీ బోడేపూడి వెంకటేశ్వరరావు పాల్గొంటారని చెప్పారు.

స్వాతంత్య్ర సమరయోధుడు వెంకట్రామిరెడ్డి మృతి



కొత్తపల్లి(గంపలగూడెం): గంపలగూడెం మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన స్వాతంత్ర్య సమరయోధుడు గువ్వల వెంకట్రామిరెడ్డి (93) మంగళవారం మృతి చెందారు. ఆయన రజాకార్ల ఉద్యమం సమయంలో పలు పోరాటాల్లో ఈ ప్రాంతం నుంచి పాల్గొన్నారు. భార్య గతంలోనే మృతి చెందారు. మృతునికి ముగ్గురు సంతానం. వెంకట్రామిరెడ్డి స్వాతంత్ర్య సమర యోధుల పింఛన్ తీసుకుంటున్నారు. ఆయన మృతదేహాన్ని గ్రామస్తులు సందర్శించి నివాళులర్పించారు.

ఇంటర్ పరీక్షకు 37మంది గైర్హాజరు

నూజివీడు: పట్టణంలోని రెండు పరీక్ష కేంద్రాల్లో మంగళవారం నిర్వహించిన ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షల్లో భాగంగా గణితం, జువాలజీ, హిస్టరీ పరీక్షలకు సంబంధించి ప్రథమ సంవత్సరంలో 24 మంది, ద్వితీయ సంవత్సరం పరీక్షకు 13 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ప్రథమ సంవత్సరానికి సంబంధించి మొత్తం 796 మంది విద్యార్థులకు గాను 772 మంది పరీక్ష రాశారు. పట్టణంలోని మడుపల్లి తాతయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాల, శ్రీ శారదా జూనియర్ కళాశాలలో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. మడుపల్లి తాతయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 344 మందికిగాను 332 మంది హాజరయ్యారు. 12 మంది గైర్హాజరయ్యారు. శ్రీ శారద జూనియర్ కళాశాలలో 452 మందికి గాను 440 మంది పరీక్ష రాశారు. 12 మంది గైర్హాజరయ్యారు. ద్వితీయ సంవత్సరానికి సంబంధించి మడుపల్లి తాతయ్య ప్రభుత్వ కళాశాల పరీక్ష కేంద్రంలో 176 మందికిగాను 163 మంది పరీక్ష రాయగా, 13 మంది గైర్హాజరయ్యారు.

వంట ఏజెన్సీ నిర్వాహకులకు శిక్షణ

ముసునూరు: పాఠశాల చిన్నారులకు మెనూ ప్రకారం రుచికరంగా వండి వడ్డించాలని ఎంఈఓ బీవీఎస్ సుబ్బారావు అన్నారు. చెక్కపల్లి హైస్కూల్లో మంగళవారం మండలంలోని అన్ని పాఠశాలల్లోని మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకులకు ఒక రోజు శిక్షణా తరగతులు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నిర్ణయించిన మెనూ ప్రకారం సోమవారం నుంచి శుక్రవారం వరకు, శనివారం వండవలసిన ఆహార పదార్థాలను రుచికరంగా తయారు చేసి చిన్నారులకు వడ్డించాలని సూచించారు. వంట చేసే వ్యక్తులు వ్యక్తిగత పరిశుభ్రతను, వంటశాల పరిసరాల పరిశుభ్రతను పాటిస్తూ రుచిగా, శుచిగా భోజన పదార్థాలు తయారు చేయాలన్నారు. రిసోర్స్‌పర్సన్లు అవగాహన కల్పించారు.

బాల్య వివాహాల నిరోధంపై అవగాహన

ముసునూరు: కిశోర బాలికలకు రుతుక్రమంపై సంపూర్ణ అవగాహన కల్పించాలని నూజివీడు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ధనలక్ష్మి అన్నారు. మండలంలోని చెక్కపల్లి అంగన్‌వాడీ కేంద్రం వద్ద ఐసీడీఎస్ విభాగం ఆధ్వర్యంలో కిశోర బాలికలు, బాలికల తల్లులకు రుతుక్రమ విజ్ఞానం, వ్యక్తిగత పరిశుభ్రత, బాల్య వివాహాల నిరోధంపై మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ధనలక్ష్మి మాట్లాడుతూ సమాజాన్ని అర్థం చేసుకుని, తగిన జాగ్రత్తలతో కిశోర బాలికలు నడుచుకోవాలన్నారు. రుతుక్రమ సమయాల్లో జాగ్రత్తలు, వ్యక్తిగత పరిశుభ్రత, స్వీకరించవలసిన పోషకాహారంపై బాలికలకు అవగాహన కల్పించారు. బాలికల నడతపై వారి తల్లులు దృష్టి పెట్టి, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో మహిళా కానిస్టేబుల్ ఎంవీ రమణ, వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ వర్కర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

పీహెచ్‌సీల్లో అర్ధరాత్రి ఆకస్మిక తనిఖీలు

వైద్య సేవలపై డీఎంహెచ్ఓ ఆరా

లబ్బీపేట(విజయవాడతూర్పు): జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో 24 గంటలు ప్రసూతి సేవలు అందుబాటులో ఉండటంతో వాటిని పరిశీలించేందుకు డీఎంహెచ్ఓ డాక్టర్ మాచర్ల సుహాసిని సోమవారం అర్ధరాత్రి పీహెచ్‌సీల్లో ఆకస్మిక తనిఖీలు చేశారు. జి. కొండూరు, కొండపల్లి, ఇబ్రహీంపట్నం పీహెచ్‌సీలను ఆకస్మికంగా సందర్శించి అర్ధరాత్రి వేళల్లో అందుతున్న సేవలు, సిబ్బంది అందుబాటును తనిఖీ చేశారు. ఆయా పీహెచ్‌సీల్లో కాన్పు కోసం వచ్చిన గర్భిణులు, బాలింతల యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. వారికి అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ మాట్లాడుతూ జిల్లాలో రానున్న రోజుల్లో మరిన్ని ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తామన్నారు. రాత్రి వేళల్లో విధుల్లో లేకున్నా, నిర్లక్ష్యం వహించినా కఠిన చర్యలు తీసుకుంటామని సిబ్బందిని హెచ్చరించారు.



ఇబ్రహీంపట్నం పీహెచ్‌సీలో అర్ధరాత్రి తనిఖీ చేస్తున్న డీఎంహెచ్ఓ డాక్టర్ సుహాసిని

రేపటి నుంచి హనుమజ్జయంతి

మేదూరు(గంపలగూడెం): జిల్లాలో ప్రసిద్ధి చెందిన గంపలగూడెం మండలం మేదూరు వీరాంజనేయ స్వామి సన్నిధిలో ఈనెల 30వ తేదీ నుంచి మూడు రోజుల పాటు స్వామి వారి జయంతి ఉత్సవాలు జరుగుతాయని ఆలయ కమిటీ చైర్మన్ ముత్యాల రామకృష్ణ, ఆలయ మేనేజర్ జన్ను వెంకటేశ్వర రావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం ఉదయం 9 గంటలకు విఘ్నేశ్వరపూజతో ఉత్సవాలు ప్రారంభిస్తారు. కలశ స్థాపన, పుణ్యాహవచన, అఖండ దీపారాధన, అనంతరం 108 బిందెల జలంతో స్వామివారికి అభిషేకం నిర్వహిస్తారు. 31వ తేదీన వీరాంజనేయస్వామికి 108 బిందెల పంచామృతాలతో అభిషేకం జరుగుతుంది. జూన్ ఒకటో తేదీన హనుమజ్జయంతి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారు. 108 బిందెలతో పంచామృత స్నానం, తమలపాకులతో అర్చన, సాయంత్రం ఐదు గంటలకు స్వామివారి గ్రామోత్సవం నిర్వహిస్తారు. హనుమజ్జయంతి సందర్భంగా మూడు రోజులు ఆలయ ప్రాంగణంలో మధ్యాహ్నం భక్తులకు అన్నసంతర్పణ జరుగుతుంది. గోసవీడు భక్తాంజనేయస్వామి, ఆర్లపాడు అభయాంజనేయస్వామి ఆలయాల్లో కూడా హనుమజ్జయంతి వేడుకలు నిర్వహిస్తామని కమిటీ సభ్యులు వివరించారు.

శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించండి

వెస్ట్ జోన్ ఏసీపీ మురళీ కృష్ణారెడ్డి

ఇబ్రహీంపట్నం: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించాలని వెస్ట్ జోన్ ఏసీపీ మురళీ కృష్ణారెడ్డి అన్నారు. జూపూడి నోవా, నిమ్రా కళాశాలల్లో జూన్ 4వ తేదీన కౌంటింగ్ జరుగనున్న నేపథ్యంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులకు ఎన్నికల కౌంటింగ్ నియమావళిపై ఇబ్రహీంపట్నంలో మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అన్ని గ్రామాల్లో 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. నలుగురికి మించి గుమికూడరాదని చెప్పారు. విజయోత్సవ ర్యాలీలు, సభలు నిషేధమన్నారు. సోషల్ మీడియాలో రెచ్చగొట్టే పోస్టులు, డీజే బాక్స్‌లతో రెచ్చగొట్టే చర్యలకు పాల్పడవద్దన్నారు. కౌంటింగ్ కేంద్రాల్లో బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. కౌంటింగ్ హాల్లోకి సెల్‌ఫోన్లకు అనమతి లేదన్నారు. కార్యక్రమంలో సీఐ ఎం.సత్యనారాయణ, పోలీస్ సిబ్బంది, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.



రాజకీయ పార్టీల నాయకులతో మాట్లాడుతున్న ఏసీపీ మురళీ కృష్ణారెడ్డి, ఎం.సత్యనారాయణ

కిశోర బాలికలు అపోహలు వీడాలి

తిరువూరు: యుక్త వయస్సులో ఉన్న బాలికలు తమ శారీరక సమస్యలపై అపోహలు వీడాలని తిరువూరు అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి రేష్మా బేగం అన్నారు. స్థానిక అర్బన్ హెల్త్ సెంటర్‌లో రుతుక్రమం, ఆరోగ్యం, పరిశుభ్రత దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. రుతుక్రమం ఎటువంటి వ్యాధి కాదని, ఈ సమయంలో ఆడవారిని తాకరాదని, బాలికలు పాఠశాలకు వెళ్లకూడదని కొందరు భావించడం సరికాదన్నారు. రుతుక్రమం సాధారణ శరీర ప్రక్రియగా భావించాలని, ప్రతి ఆడపిల్లలో 10 నుంచి 14 సంవత్సరాల నడుమ ఈ రుతుక్రమం ప్రారంభమై 50 ఏళ్ల వరకు కొనసాగుతుందని చెప్పారు. ఆరోగ్య పర్యవేక్షకులు కె. రవి, హెల్త్ విజిటర్ ఆశాబీ, సచివాలయ ఆరోగ్య కార్యదర్శులు, ఆశావర్కర్లు, కిశోర బాలికలు పాల్గొన్నారు.



కిశోర బాలికలతో డాక్టర్ రేష్మాబేగం, సిబ్బంది

అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు

తిరువూరు: ఎన్నికల నియమావళిని ఉల్లంఘించి గ్రామాల్లో ఎవరైనా అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని తిరువూరు సీఐ అబ్దుల్ నబీ హెచ్చరించారు. మంగళవారం తిరువూరు పట్టణం, మండలంలోని పలు గ్రామాల్లో పోలీసులు ఎన్నికల నియమావళిపై ప్రజలకు అవగాహన కల్పించారు. 144 సెక్షన్ అమలులో ఉన్నందున నలుగురి కంటే ఎక్కువమంది గుమికూడ రాదని, అనుమతి లేకుండా సభలు, సమావేశాలు నిర్వహించరాదని చెప్పారు. బాణసంచా కాల్చడం, డీజే సౌండ్ వినియోగించడం నిషిద్ధమన్నారు. సామాజిక అశాంతి కలిగించే కార్యక్రమాలు నిర్వహించడం, వాట్సాప్ సందేశాలు పంపడం వంటి చర్యలకు పాల్పడే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు. ఎస్ఐ సత్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.



తిరువూరు ప్రధాన వీధుల్లో పోలీసుల పహారా

అవరోధాలను అధిగమిస్తే విజయాలు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): మార్కెటింగ్‌లో ఎదురయ్యే అవరోధాలను అధిగమిస్తే మంచి విజయాలను పొందవచ్చని ఫైన్ ల్యాబ్స్ సేల్స్ మేనేజర్ పి.నరేష్ అన్నారు. కాకరపర్తి భావనారాయణ కళాశాల పీజీ మేనేజ్‌మెంట్ స్టడీస్ విభాగం ఆధ్వర్యంలో ప్రపంచ మార్కెటింగ్ దినోత్సవాన్ని పురస్కరించుకొని 'మార్కెటింగ్ అవకాశాలు – అవరోధాలు' అంశంపై సదస్సును మంగళవారం కళాశాల ప్రాంగణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా నరేష్ మాట్లాడుతూ ఏ రంగంలోనైనా మార్కెటింగ్ ఆ సంస్థల విజయావకాశాలను ప్రభావితం చేస్తాయన్నారు. మార్కెటింగ్‌లో రాణిస్తే ఆ సంస్థ అద్భుతమైన విజయాలను, దానితో పాటుగా ఆర్థికశక్తిని పెంచుకోవటానికి అవకాశాలు ఉంటాయన్నారు. అయితే మార్కెటింగ్‌లో చాలా అవకాశాలతో పాటుగా అవరోధాలు సైతం ఎదురవుతాయన్నారు. విద్యార్థులు అవరోధాలను అధ్యయనం చేసినప్పుడు సమస్యలు వాటి పరిష్కారాలు తెలుసుకోవటానికి అవకాశం ఉంటుందన్నారు. ఏ రంగంలోనైనా అవగాహన, అధ్యయనం లేకుండా మార్కెటింగ్ అంశంలో రాణించటానికి అవకాశం ఉండదన్నారు. విద్యార్థులు ఆ దిశగా తమ దృష్టిని కేంద్రీకరించాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.నారాయణరావు మాట్లాడుతూ విద్యార్థులకు వారివారి రంగాల్లో చోటు చేసుకున్న అంశాలను తెలుసుకోవటానికి అనేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు వివరించారు. పీజీ డైరెక్టర్ ఎస్.వెంకటేష్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

- **జగ్గయ్యపేట:** పిల్లిపెసర విత్తనాలు అందుబాటులో ఉన్నాయని వ్యవసాయాధికారి వరలక్ష్మి మంగళవారం తెలిపారు. రైతు భరోసా కేంద్రాల్లో ప్రభుత్వం మొదటి విడతగా 50 క్వింటాళ్ల పిల్లిపెసరను అందుబాటులో ఉంచిందన్నారు. మరో రెండు, మూడు రోజుల్లో జీలుగ విత్తనాలు కూడా వస్తాయని తెలిపారు. పిల్లిపెసర విత్తనాలను రెండు రోజుల్లో రైతులకు పంపిణీ చేస్తామని చెప్పారు.